వాయిస్ ఆఫ్ ప్రజలు
# వాయిస్ టుడే
TGTEL/25/A2649
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం – మననేత్రం
Follow
పేజీలు 10
గురువారం, డిసెంబరు 18, 2025
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## కాలుష్యంపై ఢిల్లీ ఉక్కుపాదం.. నేటి నుంచి కొత్త నిబంధనలు



- ఢిల్లీలోకి బీఎస్-6 ఇంజిన్‌లేని వాహనాల ప్రవేశంపై నిషేధం
- పీయూసీ సర్టిఫికెట్ లేని వాహనాలకు పెట్రోల్ నిలిపివేత
- పొరుగు నగరాల నుంచి వచ్చే 12 లక్షల వాహనాలపై ప్రభావం
- నిబంధనల అమలుకు 126 చెక్‌పోస్టులు, ప్రత్యేక బృందాలుపాఠశాలలు, కార్యాలయాలపై కూడా ఆంక్షలు అమలు

## మూడో విడతలో
# 85.77% పోలింగ్



### ప్రజల నమ్మకమే పాలనకు పునాది



- రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి: మంత్రి పొంగులేటి
- గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచన
- ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందన్న హామీ

- యాదాద్రి జిల్లాలో అత్యధిక ఓటింగ్, నిజామాబాద్‌లో అత్యల్పం
- 3 విడతల ఎన్నికలు ప్రశాంతంగా ముగింపు
- వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్‌పై నిఘా
- సాయంత్రానికల్లా ఫలితాల వెల్లడి

హైదరాబాద్: రాష్ట్రంలో మూడు విడతలుగా నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. తుది విడతలో 85.77 శాతం పోలింగ్ నమోదు కాగా, మొదటి విడతలో 84.28 శాతం, రెండో విడతలో 85.86 శాతం ఓటింగ్ జరిగింది. బుధవారం ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు భారీగా తరలివచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంటతో పోలింగ్ ముగియగా, ఆ సమయానికి క్యూలో ఉన్న వారందరికీ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు.పోలింగ్ అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, విజేతలను ప్రకటించారు. చాలా చోట్ల ఉపసర్పంచ్ ఎన్నికలు కూడా బుధవారం రాత్రికల్లా పూర్తయ్యాయి. ఈ విడతలో 182 మండలాల్లోని 4,159 గ్రామ పంచాయతీలకు నోటిఫికేషన్ జారీ చేయగా, 394 పంచాయతీలు, 7,908 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 3,752 గ్రామ పంచాయతీలు, 28,410 వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. సర్పంచ్ పదవికి 12,652 మంది, వార్డు సభ్యులుగా 75,725 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. రెండు పంచాయతీలు, 18 వార్డులకు ఎన్నికలు జరగలేదు. ఈ విడతలో మొత్తం 50.56 లక్షల మంది

(మిగతా 2వ పేజీలో)



## పల్లె ప్రజల తీర్పు.. కాంగ్రెస్ పతనానికి నాంది!

- ఎన్నికల ఫలితాలు చరిత్రలో నిలిచిపోతాయి: కేటీఆర్
- అధికార పక్షానికి సగం సీట్లు కూడా రాని అరుదైన పరిణామం
- రేవంత్ పాలనపై పల్లెల్లో ప్రతిఘటనకు నిదర్శనం
- బీఆర్ఎస్ కార్యకర్తల పోరాటానికి ప్రజల పట్టం

హైదరాబాద్, డిసెంబరు 17 : రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పల్లె ప్రజలు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ పార్టీ పతనానికి నాంది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన ఎన్నికల ఫలితాలపై స్పందించారు. సాధారణంగా పంచాయతీ ఎన్నికలు అధికార పక్షానికి అనుకూలంగా ఉంటాయని, అయితే ముఖ్యమంత్రి స్వయంగా జిల్లాలు తిరుగుతూ ప్రచారం చేసినప్పటికీ కాంగ్రెస్ పార్టీ సగం సీట్లు కూడా సాధించలేకపోయిందన్నారు. ఈ ఫలితాలతో సీఎం రేవంత్‌రెడ్డికి ముచ్చెమటలు పట్టాయని వ్యాఖ్యానించారు. అధికార పార్టీ ఇంత తక్కువ స్థానాలకు పరిమితం కావడం, ప్రధాన ప్రతిపక్షం ఇంత పెద్ద సంఖ్యలో పంచాయతీలను గెలుచుకోవడం గతంలో ఎన్నడూ లేని పరిణామమన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ మోసాలు, వైఫల్యాలపై తెలంగాణ పల్లె ప్రజలు మోగించిన

(మిగతా 2వ పేజీలో)

## శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు రాష్ట్రపతి

- హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చేరుకున్న ముర్ము
- ఉప ముఖ్యమంత్రి, మంత్రుల స్వాగతం
- డిసెంబరు 22 వరకు ట్రాఫిక్ ఆంక్షలు



హైదరాబాద్: శీతాకాల విడిది కోసం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు చేరుకున్నారు. హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఆమెకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు,

(మిగతా 2వ పేజీలో)



## ఫిరాయింపు కేసుల్లో ఐదుగురు ఎమ్మెల్యేలకు ఊరట

- మిగిలిన ఐదుగురిపై ఇంకా పెండింగ్
- స్పీకర్ నిర్ణయంపై బీఆర్ఎస్ ఆగ్రహం
- హైకోర్టుకు వెళ్లనున్నట్లు ప్రకటన

హైదరాబాద్: పార్టీ ఫిరాయింపుల అంశంలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. బీఆర్ఎస్ నుంచి ఎన్నికై పార్టీ మారారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లను ఆయన బుధవారం డిస్మిస్ చేశారు. దీంతో ఈ ఎమ్మెల్యేలకు తక్షణ ఊరట లభించినట్లయింది. బీఆర్ఎస్ తరఫున మొత్తం పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లు దాఖలుకాగా, తొలి విడతలో ఐదుగురిపై స్పీకర్ తీర్పు వెలువరించారు. పార్టీ నుంచి స్వచ్ఛందంగా వైదొలిగినట్లు నిరూపణ కాలేదన్న

(మిగతా 2వ పేజీలో)

## బీమా రంగంలో 100% ఎఫ్‌డీఐలకు గ్రీన్ సిగ్నల్



- సబ్‌కా బీమా సబ్‌కా రక్షా బిల్లుకు పార్లమెంట్ ఆమోదం
- ప్రతిపక్ష సవరణలకు నో చెప్పిన ప్రభుత్వం
- పెట్టుబడులు, పోటీ, ఉద్యోగాలకు ఊతం
- చౌకగా పాలసీలు అందుబాటులోకి వచ్చే అవకాశం

## మనది సహజ భాగస్వామ్యం

- ఇథియోపియాకు వస్తే సొంత ఇంటికి వచ్చినట్లే..
- కీలక రంగాల్లో రెండు దేశాలు కలిసికట్టుగా పనిచేయాలి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు
- ఇథియోపియా పార్లమెంట్ సంయుక్త సమావేశంలో ప్రసంగం



# మనది సహజ భాగస్వామ్యం

### ఇథియోపియాకు వస్తే సొంత ఇంటికి వచ్చినట్లే..

### కీలక రంగాల్లో రెండు దేశాలు కలిసికట్టుగా పనిచేయాలి

### ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు

### ఇథియోపియా పార్లమెంట్ సంయుక్త సమావేశంలో ప్రసంగం



అడిస్ అబాబా: ప్రాంతీయ శాంతి, భద్రత, అనుసంధానంలో భారత్, ఇథియోపియాలు సహజ భాగస్వామ్య దేశాలు అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ప్రపంచ శాంతి, సమానత్వం, ప్రగతి కోసం రెండు దేశాలు కలిసికట్టుగా పని చేస్తున్నాయని ఉద్ఘాటించారు. ద్వైపాక్షిక పర్యటన నిమిత్తం మంగళవారం ఇథియోపియా చేరుకున్న ప్రధాని మోదీ బుధవారం దేశ పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగించారు. 'తేనా ఇస్టిలిన్ సలామ్' అంటూ స్థానిక భాషలో ఎంపీలకు అభివాదం చేశారు. సింహాల గడ్డగా ప్రసిద్ధి చెందిన ఇథియోపియాలో అడుగుపెట్టడం అద్భుతంగా ఉందన్నారు. ఇక్కడికి వస్తే సొంత ఇంటికి వచ్చినట్లే ఉంటుందని, తన సొంత రాష్ట్రం గుజరాత్ కూడా సింహాలకు ప్రసిద్ధి చెందిందని తెలిపారు. ప్రధానమంత్రి హోదాలో మోదీ ప్రసంగించిన విదేశీ పార్లమెంట్లలో ఇది 18వ పార్లమెంట్ కావడం విశేషం. ఆయన మాట్లాడుతుండగా ఇథియోపియా ఎంపీలు 50 సార్లకుపైగా చప్పట్లు కొట్టి హర్షం వ్యక్తంచేశారు.

#### శుభాకాంక్షలు మోసుకొచ్చా..

"ఆఫ్రికా ఖండంలో ఇథియోపియా కీలక స్థానంలో ఉంది. హిందూ మహాసముద్రంలో భారత్ హృదయ స్థానంలో నిలిచింది. ఇరుదేశాలు సహజ భాగస్వామ్య దేశాలు. ఈ ఏడాది కుదుర్చుకున్న రక్షణ సహకార ఒప్పందంతో పరస్పర భద్రత పట్ల అంకితభావం మరింత బలపడింది. భారత్, ఇథియోపియాలు ఒక కుటుంబంగా కలిసి ఉంటున్నాయి. ఉమ్మడి ప్రయోజనాలు కాపాడుకోవడంతోపాటు ప్రపంచ సౌభాగ్యం కోసం కృషి చేస్తున్నాయి. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత భారత్‌కు అండగా నిలిచినందుకు ఇథియోపియాకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఉగ్రవాదంపై అవిశ్రాంతంగా పోరాటం కొనసాగిస్తున్నాం. ఈ ప్రజాస్వామ్య దేశాలయంలో ప్రసంగించే అవకాశం రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. 140 కోట్ల మంది భారతీయుల తరపున శుభాకాంక్షలు మోసుకొచ్చా.

#### జన్మభూమి మన కన్నతల్లి

ప్రపంచంలో ప్రాచీన నాగరికతల్లో ఇథియోపియా కూడా ఒకటి. ఇది పాత, కొత్తల సమ్మేళనం. ఇక్కడ ప్రాచీన విజ్ఞానం, ఆధునిక ఆకాంక్షల మధ్య సమతూకం కనిపిస్తోంది. ఇదే ఇథియోపియా అసలైన బలం. భారతదేశ నాగరికత అత్యంత ప్రాచీనమైనది. పూర్తి ఆత్మవిశ్వాసంతో భవిష్యత్తులోకి అడుగులు వేస్తోంది. భారత జాతీయ గీతం, ఇథియోపియా జాతీయ గేయం ఒకే అర్థాన్ని సూచిస్తున్నాయి. జన్మభూమిని కన్నతల్లిగా సంబోధిస్తున్నాయి. సంస్కృతి, సంప్రదాయాలు, జన్మభూమిని కాపాడుకొనే విషయంలో అవే మనకు స్ఫూర్తిదాయకం. ఇథియోపియా అభివృద్ధిలో వేలాది మంది భారతీయ ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిది. అభివృద్ధి చెందుతున్న దేశాలుగా మనం పరస్పరం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. వ్యవసాయమే మనకు వెన్నుముక. మెరుగైన విత్తనాలు, సాగునీటి సరఫరా విధానాలు, భూమిలో సారం పెంచడంపై మనం దృష్టి పెట్టాలి. కలిసికట్టుగా పనిచేయాలి.

#### ప్రజాస్వామ్యం జీవన విధానం

ఇథియోపియాలోని కీలక రంగాల్లో భారతీయ కంపెనీలు 5 బిలియన్ డాలర్లకుపైగా పెట్టుబడి పెట్టాయి. దీంతో స్థానికంగా 75 వేల ఉద్యోగాల సృష్టి జరిగింది. మన భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడానికి ఎన్నో అవకాశాలున్నాయి. ఆ దశగానే రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకోవాలని నిర్ణయించాం. దీనివల్ల టెక్నాలజీ, నూతన ఆవిష్కరణలు, మైనింగ్, క్లీన్ ఎనర్జీ, ఆహార భద్రత వంటి రంగాల్లో రెండుదేశాల బంధం బలపడుతుంది. మన ఆర్థిక వ్యవస్థలకు మేలు జరుగుతుంది. డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల్లో మేము సాధించిన నైపుణ్యాలు, అనుభవాన్ని ఇథియోపియాతో పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. భారత్, ఇథియోపియాలు నిఖార్సైన ప్రజాస్వామ్య దేశాలు. ప్రజాస్వామ్యం మన జీవన విధానం. ఇదొక ప్రయాణం. తేనీరు అంటే నాకు ఇష్టం. ఇథియోపియన్ కాఫీ, ఇండియన్ టీ తరహాలోనే మన స్నేహం చక్కటి పరిమళాలు వెదజల్లుతోంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన ప్రసంగం ముగిసిన తర్వాత ఇథియోపియా ఎంపీలు మోదీకి 'స్టాండింగ్ ఒవేషన్' ఇచ్చారు. పలువురు మంత్రులు, ఎంపీలతో మోదీ మాట్లాడారు. 'ఏక్ పేడ్ మా కే నామ్ పే' కార్యక్రమంలో భాగంగా మోదీ ఇథియోపియా పార్లమెంట్ ప్రాంగణంలో మొక్క నాటారు.

#### మోదీకి అత్యున్నత పౌర పురస్కారం

ఇథియోపియా ప్రభుత్వం భారత ప్రధాని మోదీకి తమ అత్యున్నత పౌర పురస్కారమైన 'నిశాన్ ఆఫ్ ఇథియోపియా'ను ప్రదానం చేసింది. ఈ పురస్కారం అందుకున్న మొట్టమొదటి విదేశీ నాయకుడు మోదీ కావడం గమనార్హం. ఆయనను ఇప్పటిదాకా ప్రపంచవ్యాప్తంగా 28 దేశాలు తమ అత్యున్నత పౌర పురస్కారంతో సత్కరించాయి.

#### మంత్రముగ్ధులను చేసిన 'వందేమాతరం'

ప్రధాని మోదీ గౌరవార్థం ఇథియోపియా ప్రధానమంత్రి అబీ అహ్మద్ అలీ మంగళవారం ప్రత్యేక విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ముగ్గురు ఇథియోపియా గాయకులు భారత జాతీయ గీతం 'వందేమాతరం'ను శ్రుతిబద్ధంగా ఆలపించారు. ప్రధాని మోదీ సహా భారత ప్రతినిధులు ముగ్ధులయ్యారు. చప్పట్లతో అభినందించారు. ఇథియోపియా గాయకుల ఆలాపన తనను ఎంతగానో ఆకట్టుకుందని ప్రశంసిస్తూ మోదీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. సంబంధిత వీడియోను సైతం షేర్ చేశారు. వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సమయంలోనే ఈ గీతాన్ని ఇథియోపియా గాయకుల నోటి వెంట వినడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

# బీమా రంగంలో 100% ఎఫ్‌డీఐలకు గ్రీన్‌సిగ్నల్



న్యూఢిల్లీ, డిసెంబరు 18 : దేశంలో బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 100 శాతం వరకు అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'సబ్‌కా బీమా సబ్‌కా రక్షా (బీమా చట్టాల సవరణ) బిల్లు–2025'కు పార్లమెంట్ ఆమోదముద్ర వేసింది. మంగళవారం లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు, బుధవారం రాజ్యసభలో మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. ప్రస్తుతం బీమా రంగంలో 74 శాతం ఎఫ్‌డీఐలకు అనుమతి ఉండగా, ఈ బిల్లుతో ఆ పరిమితిని పూర్తిగా ఎత్తివేశారు. రాజ్యసభలో బిల్లుపై జరిగిన చర్చలో ప్రతిపక్షం ప్రతిపాదించిన పలు సవరణలను ప్రభుత్వం తిరస్కరించింది. బిల్లును మరింత లోతుగా పరిశీలించేందుకు పార్లమెంటరీ కమిటీకి పంపించాలని విపక్ష సభ్యులు కోరినా, ప్రభుత్వం అందుకు అంగీకరించలేదు. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చర్చకు సమాధానమిచ్చారు. బీమా రంగంలో మరిన్ని సానుకూల మార్పులు తీసుకువచ్చి ప్రజలకు విస్తృత రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఇప్పటికే అనేక కీలక సంస్కరణలు అమలు చేశామని గుర్తుచేశారు. ప్రజలకు, వ్యాపారాలకు, వ్యవసాయ రంగానికి బీమా రక్షణ విస్తరిస్తేనే దేశ అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. 100 శాతం ఎఫ్‌డీఐలకు అనుమతితో విదేశీ బీమా కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని మంత్రి చెప్పారు. దీని వల్ల రంగంలో పోటీ పెరిగి, కొత్త తరహా పాలసీలు అందుబాటులోకి వస్తాయని, ప్రీమియం తగ్గే అవకాశముందని పేర్కొన్నారు. బీమా కవరేజీ విస్తరించడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని ఆమె వివరించారు. విదేశీ పెట్టుబడులతో బీమా రంగం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని, దీని ప్రయోజనాలు సామాన్య ప్రజల వరకు చేరతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

## తెలంగాణలో చలి పంజా..
## సింగిల్ డిజిట్‌కు పడిపోయిన ఉష్ణోగ్రతలు

### రాష్ట్రాన్ని వణికిస్తున్న తీవ్రమైన చలి

### సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 7.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత



తెలంగాణ రాష్ట్రాన్ని చలిపులి వణికిస్తోంది. పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో ప్రజలు గజగజలాడుతున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలం చలి గుప్పిట్లో చిక్కుకుంది. బుధవారం ఉదయం ఇక్కడ అత్యల్పంగా 7.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గత పదిహేను రోజులుగా ఇక్కడ సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలే నమోదవుతుండటం గమనార్హం.సాధారణంగా ఏటా కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కానీ ఈసారి సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సిద్దిపేట జిల్లా పోతిరెడ్డిపేటలో 9.2 డిగ్రీలు, మెదక్ జిల్లా దామరంచలో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.మరోవైపు దేశవ్యాప్తంగా పొగమంచు ప్రభావం తీవ్రంగా ఉంది. తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు పొగమంచు కమ్మేయడంతో ఉత్తరాది రాష్ట్రాలతో పాటు పలు నగరాల్లో జనజీవనం స్తంభిస్తోంది. అధిక పీడనం, బలహీనమైన వెస్టర్న్ డిస్టర్బెన్స్ కారణంగా పొగమంచు కురుస్తోందని వాతావరణ నిపుణులు తెలిపారు.చలి తీవ్రత రైల్వే ప్రయాణాలపై కూడా ప్రభావం చూపుతోంది.



## కాలుష్యంపై ఢిల్లీ ఉక్కుపాదం.. నేటి నుంచి కొత్త నిబంధనలు

### ఢిల్లీలోకి బీఎస్-6 ఇంజిన్ లేని వాహనాల ప్రవేశంపై నిషేధం

### పీయూసీ సర్టిఫికెట్ లేని వాహనాలకు పెట్రోల్ నిలిపివేత

### పొరుగు నగరాల నుంచి వచ్చే 12 లక్షల వాహనాలపై ప్రభావం

దేశ రాజధాని ఢిల్లీలో ప్రమాదకర స్థాయికి చేరిన వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) స్టేజ్–4 ఆంక్షల్లో భాగంగా బీఎస్–6 ప్రమాణాలు లేని ఇంజిన్ వాహనాలు గురువారం నుంచి ఢిల్లీలోకి ప్రవేశించకుండా నిషేధం విధించింది. అంతేకాకుండా, పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయూసీ) సర్టిఫికెట్ లేని వాహనాలకు పెట్రోల్ బంకుల్లో ఇంధనం నింపవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.ఈ నిర్ణయంతో ఢిల్లీ సరిహద్దు నగరాలైన గురుగ్రామ్, ఘజియాబాద్, ఫరీదాబాద్, నోయిడా నుంచి రోజూ రాకపోకలు సాగించే సుమారు 12 లక్షల వాహనాలపై ప్రత్యక్ష ప్రభావం పడనుంది. ఇందులో ఘజియాబాద్ నుంచి 5.5 లక్షలు, నోయిడా నుంచి 4 లక్షలు, గురుగావ్ నుంచి 2 లక్షల వాహనాలు ఉన్నట్లు అంచనా. ఈ నిబంధనలను పక్కాగా అమలు చేసేందుకు ప్రభుత్వం 126 చెక్‌పోస్టుల వద్ద 580 మంది పోలీసు సిబ్బందిని, 37 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను మోహరించింది.పెట్రోల్ బంకుల వద్ద పీయూసీ నిబంధనను పర్యవేక్షించేందుకు రవాణా, మున్సిపల్, ఆహార శాఖల అధికారులను నియమించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా పీయూసీ లేని వాహనాలను సులభంగా గుర్తించనున్నారు. శీతాకాలంలో ఢిల్లీ కాలుష్యంలో వాహనాల వాటా 25 శాతం వరకు ఉంటోందని అధ్యయనాలు తేల్చడంతో ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.ఇప్పటికే ఢిల్లీలో ప్రాథమిక పాఠశాలలకు ప్రత్యక్ష తరగతులను నిలిపివేయగా, కార్యాలయాలు 50 శాతం సిబ్బందితో పనిచేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కాగా, బుధవారం సాయంత్రం ఢిల్లీ గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 334గా 'చాలా పేలవం' కేటగిరీలో నమోదైంది. ఇదే అంశంపై ఇవాళ లోక్‌సభలో చర్చ జరగనుండగా, కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ సమాధానం ఇవ్వనున్నారు.



## ఫిరాయింపు కేసుల్లో ఐదుగురు ఎమ్మెల్యేలకు ఊరట

కారణంతో పిటిషన్లను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను శాసనసభ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్లు అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి. నర్సింహాచార్యులు తెలిపారు. ఈ నిర్ణయంతో డాక్టర్ తెల్లం వెంకట్‌రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్‌రెడ్డి, అరికెపూడి గాంధీకి ఊరట లభించింది. అయితే దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, డాక్టర్ సంజయ్ కేసులపై స్పీకర్ ఇంకా నిర్ణయం ప్రకటించకపోవడంతో వారి భవితపై సస్పెన్స్ కొనసాగుతోంది. స్పీకర్ చైర్మన్‌గా వ్యవహరించిన ట్రిబ్యునల్ ఇరు పక్షాల వాదనలు పూర్తిగా విన్న అనంతరం రాజ్యాంగంలోని పదో షెడ్యూల్, ఫిరాయింపుల నిరోధక చట్ట నిబంధనల మేరకు విచారణ జరిపినట్లు స్పీకర్ తెలిపారు. పిటిషన్లలో పేర్కొన్న అంశాలు, సమర్పించిన ఆధారాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. స్పీకర్ నిర్ణయాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా తప్పుబట్టింది. పార్టీ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ.. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు బహిరంగంగా కాంగ్రెస్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నప్పటికీ పిటిషన్లను డిస్మిస్ చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించనున్నట్లు ప్రకటించారు. ఇక స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పీకర్ నోటీసులకు స్పందిస్తూ తాను ఇప్పటికీ బీఆర్ఎస్ సభ్యుడినేనని లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చారు. ఆయన సమాధానంపై ఈ నెల 19లోగా అభ్యంతరాలు తెలపాలని స్పీకర్ గడువు విధించినట్లు సమాచారం. మిగిలిన మూడు కేసులపై గురువారం నిర్ణయం వెలువడే అవకాశముందని అసెంబ్లీ వర్గాలు వెల్లడించాయి.

## పల్లె ప్రజల తీర్పు.. కాంగ్రెస్ పతనానికి నాంది!

హెచ్చరిక గంటగా అభివర్ణించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చారని, హామీలు అమలు చేయకుండా రైతాంగాన్ని ఇబ్బందులకు గురి చేశారని కేటీఆర్ ఆరోపించారు. పచ్చని పల్లెల్లో రాజకీయ ఉద్రిక్తతలు సృష్టించి, హింసా వాతావరణాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. హామీలు అమలు చేయకుండా, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డ కాంగ్రెస్‌కు ప్రజలు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ఈ తీర్పు తర్వాత రానున్న ప్రతి ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ మరింత పతనం తప్పదని కేటీఆర్ స్పష్టం చేశారు. అధికార దుర్వినియోగం, బల ప్రయోగం, రాజకీయ హింసను ఎదుర్కొంటూ ప్రజల తరఫున పోరాడిన బీఆర్ఎస్ పార్టీకి పల్లె ప్రజలు పట్టం కట్టారని చెప్పారు. ఇది సామాన్య విజయం కాదని, చరిత్రలో నిలిచిపోయే పోరాటమని పేర్కొన్నారు. ఈ యుద్ధంలో సైనికుల్లా పోరాడిన ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తకు సలాం చేస్తున్నానని కేటీఆర్ తెలిపారు. తమ కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్న ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు. కాగా, బుధవారం రాత్రి తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు.

## మూడో విడతలో 85.77% పోలింగ్

ఓటర్లు ఉండగా, 43.37 లక్షల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాల వారీగా చూస్తే యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యధికంగా 92.56 శాతం పోలింగ్ నమోదైంది. మెదక్, సూర్యాపేట, ఖమ్మం, నల్లగొండ జిల్లాలు అధిక పోలింగ్ నమోదైన జిల్లాల జాబితాలో నిలిచాయి. వలసలు ఎక్కువగా ఉండే నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది. అత్యల్పంగా నిజామాబాద్‌లో 76.45 శాతం ఓటింగ్ జరిగింది. మూడు విడతల పోలింగ్‌లో కొన్ని చోట్ల స్వల్ప ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ, మొత్తం మీద ఎన్నికలు ప్రశాంతంగా సాగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ విడతలో 3,547 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించారు. మూడో విడత పోలింగ్ సరళిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీకుముదిని, సీఎస్ కె.రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి కలిసి వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. వచ్చే ఎన్నికల్లో వెబ్ కాస్టింగ్ టెక్నాలజీని మరింత విస్తృతంగా వినియోగించి ఎన్నికలను మరింత పారదర్శకంగా నిర్వహిస్తామని సీఎస్ తెలిపారు. ఎన్నికలను సజావుగా నిర్వహించిన జిల్లా కలెక్టర్లు, అధికారులు, పోలింగ్ సిబ్బందిని ఆయన అభినందించారు.



## శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు రాష్ట్రపతి

రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్రపతి శీతాకాల పర్యటనలో భాగంగా ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో బస చేయనున్నారు. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేశారు. డిసెంబరు 17 నుంచి 22 వరకు హకీంపేట, బోలారం, అల్వాల్, తిరుమలగిరి, కార్ఖానా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, వాహనాల మళ్లింపులు అమలు చేయనున్నట్లు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ నెల 19న ఉదయం 11 గంటలకు జరగనున్న ఆల్ ఇండియా పబ్లిక్ సర్వీస్ కమిషనర్ల జాతీయ సదస్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించనున్నారు. సదస్సుకు దేశవ్యాప్తంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ప్రతినిధులు హాజరుకానున్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో రాష్ట్రపతి నిలయం పరిసరాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కోతుల బెడద నివారణకు ప్రత్యేక బృందాలను నియమించాలని, తేనెటీగల సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

# ఢిల్లీలో బీసీల హక్కుల కోసం నినాదం

## బీసీ రాజ్యాంగ సవరణ ప్రైవేట్ బిల్లు పెట్టాలని డిమాండ్



న్యూఢిల్లీ, 18 డిసెంబర్: ఢిల్లీలో రాజ్యసభ సభ్యుడు, బీసీజేఏసీ జాతీయ చైర్మన్ ఆర్. కృష్ణయ్య ఛాంబర్‌లో బీసీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాజీ బీసీ కమిషన్ చైర్మన్, వకులభరణం కృష్ణమోహన్, బీసీజేఏసీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కొండ దేవయ్య పటేల్ పాల్గొని కీలక చర్చలు జరిపారు. దేశవ్యాప్తంగా బీసీ జనాభా అధికంగా ఉన్నా రాజ్యాంగ పరిరక్షణలు లేక పేదరికం నుండి బయటపడలేకపోతున్నారని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సమాజ స్థాయిని పెంచడానికి మరియు అవకాశాలను విస్తరించడానికి పార్లమెంట్‌లో బీసీ ప్రైవేట్ బిల్లు తప్పనిసరిగా ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ పార్టీ వెంటనే ముందుకు రావాలని సమావేశం నిర్ణయించింది.

కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు అవకాశాలు, బాధ్యతలు రెండూ ఉన్నాయని ఆర్. కృష్ణయ్య అన్నారు. తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పోరాడినా పార్లమెంట్‌లో తమ పార్టీకి ఎంపీలు లేకపోవడం వల్ల బిల్లు ముందుకు సాగలేదని గుర్తు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా ప్రజాభిమానం ఉన్న నేపథ్యంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ చేయడం రాహుల్ గాంధీ బాధ్యత అని పేర్కొన్నారు.

అలాగే బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఏ పార్టీ అయినా బీసీల మద్దతుతోనే ఎదుగుతాయని, అందుకే పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి హక్కులు సాధించే సమయం ఇదేనని వకులభరణం కృష్ణమోహన్ తెలిపారు. డాక్టర్ కొండ దేవయ్య పటేల్ మాట్లాడుతూ తెలంగాణలో బీసీ జనాభా 2 కోట్లకు పైగా ఉందని, మొత్తం 136 బీసీ కులాలు భారతదేశంలో ఉన్నాయని గుర్తు చేశారు. "ఈ కులాల్లో చాలా కుటుంబాలు అత్యంత వెనుకబడిన స్థితిలో ఉన్నాయి. వారి విద్య, ఉపాధి, రాజకీయ హక్కులు రక్షించడానికి ప్రైవేట్ బిల్లు అవసరం. రాహుల్ గాంధీ దీనిపై నిర్ణయం తీసుకోవాలి" అని ఆయన అన్నారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా కొండ దేవయ్య పటేల్ కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావును కూడా కలిసి బీసీ ప్రైవేట్ బిల్లు మద్దతు కోరారు. సమీప భవిష్యత్తులో రాహుల్ గాంధీని స్వయంగా కలిసి అవగాహన నివేదిక అందజేయనున్నట్లు వివరించారు.



# నూతన సర్పంచులకు సన్మానం చేసిన "కాట దంపతులు"

## సర్పంచులు గ్రామ అభివృద్దే లక్ష్యంగా పనిచేయాలి

పటాన్‌చెరు నియోజకవర్గంలోని గుమ్మడిదల మండలంలోని గ్రామ పంచాయతీలకు మొదటి విడత ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన నాయకులు సర్పంచులుగా విజయం సాధించగా సర్పంచులతో పాటు వార్డు మెంబర్లను సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాటాశ్రీనివాస్ గౌడ్ సుధా.

ఈ సందర్భంగా మాట్లాడుతూ... మొదటి విడత స్థానిక ఎన్నికల్లో నూతనంగా విజయం సాధించిన సర్పంచులు గ్రామములో వీధిలైట్లు, శానిటేషన్, గ్రామస్తులకు త్రాగునీరు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. గెలిచిన కాంగ్రెస్ సర్పంచులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ సర్పంచుల గెలుపు వెనుక పార్టీ నాయకులు కార్యకర్తల సమిష్టి కృషి మరువలేనిది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ పథకాలను సర్పంచులు ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకుపోవాలి అదేవిధంగా సర్పంచులు బాధ్యతగా పనిచేస్తూ గ్రామస్తుల మన్నలను పొందాలి అన్నారు. సేవాగుణంతో పని చేసే వారికి ప్రజల గుర్తింపు ఉంటుంది అని గుర్తు చేశారు. పార్టీలో పని చేసే ప్రతి ఒక్కరు నా కుటుంబ సభ్యులేనని, గ్రామ పాలనలో వారందరి సేవ వెలకట్టలేనిదని, మీతో పాటు నేను గ్రామాల ప్రగతి లక్ష్యంగా నిరంతరం పని చేస్తాము అన్నారు. ఓటమి పాలైన కాంగ్రెస్ నాయకులు ఎవ్వరూ అధైర్యపడవద్దని వారందరూ సమయాభావంతో ఉండి గ్రామాల్లో మరింత సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ



కుత్బుల్లాపూర్ డిసెంబర్ 17(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్ లోని హనుమాన్ ఆలయంలో మల్లంపేట్ నుండి శబరికి బయలుదేరుతున్న అయ్యప్ప స్వాముల వారి ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ .. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యంత భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి దీక్షలు చేసి శబరికి వెళ్లి ఇరుముడి సమర్పిస్తున్న సందర్భంగా శబరికి క్షేమంగా వెళ్లి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అయ్యప్ప స్వాములు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు...

# శ్రీచైతన్య టెక్నో స్కూల్, యూసుఫ్‌గూడ బ్రాంచ్‌లో నాసా కిట్స్ పంపిణీ కార్యక్రమం





జూబ్లీహిల్స్ 17 డిసెంబర్( వాయిస్ టుడే): యూసుఫ్‌గూడలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో నాసా కిట్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ నీలావతి గారి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐ శాస్త్రవేత్త శివ మనోహర్ రెడ్డి గారు హాజరయ్యారు. ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధస్సు (%ూ×%), అంతరిక్ష విజ్ఞానం వంటి రంగాల్లో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. విద్యార్థులు చిన్న వయసు నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని, ప్రయోగాత్మక విద్య ద్వారా తమ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు.నాసా కిట్స్ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తి మరియు పరిశోధనా దృక్పథం పెరుగుతుందని ఆయన అన్నారు. భవిష్యత్తులో దేశానికి ఉపయోగపడే శాస్త్రవేత్తలుగా ఎదగాలని విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు.

ప్రిన్సిపాల్ నీలావతి గారు ముఖ్య అతిథికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం శివ రామకృష్ణ ఆర్.ఐ.హరికృష్ణ కోఆర్డినేటర్ మురళీకృష్ణ డీన్ రమేష్ నాసా ఇన్చార్జి శ్రీలత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# కార్యకర్తలకు అండగా నీలం..

నల్లవల్లిలో గ్యాస్ సిలిండర్ పేలి కార్యకర్త ఇళ్లు దగ్ధం..

యాభై వేల ఆర్థిక సహాయం అందజేత..

అనారోగ్యం బారినపడిన
పలువురు బాధితులను పరామర్శించిన నీలం మధు..



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : గుమ్మడిదల మండలం నల్లవల్లిలో ప్రమాదవశాత్తు నిన్న గ్యాస్ సిలిండర్ పేలి కాంగ్రెస్ కార్యకర్త కుమ్మరి ప్రశాంత్ ఇళ్లు దగ్ధం అయిన ఘటన, అనారోగ్యంతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న మంగలి విష్ణు, గాండ్ల జగదీష్, బొడ్డు వికాస్ గార్ల ఇళ్లకు వెళ్లి బాధితులకు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అండగా నిలిచారు. ప్రమాద ఘటనను తెలుసుకున్న నీలం మధు శనివారం ఉదయం బాధిత కుటుంబ సభ్యులను, అనారోగ్యం బారిన పడిన వారిని పరామర్శించారు. ఇల్లు దగ్ధం అయిన కుమ్మరి ప్రశాంత్ కుటుంబ సభ్యులకు యాభై వేల ఆర్థిక సహాయం అందించారు. కాంగ్రెస్ పార్టీ నమ్ముకున్న కార్యకర్తలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో స్థానిక సర్పంచ్ కొరివి రాణి సురేష్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ రావు, బొంతపల్లి గుడి చైర్మన్ ప్రతాప్ రెడ్డి, జైశంకర్,వీరరెడ్డి, మహేందర్ రెడ్డి,అశోక్ ,మహేష్,గారెల మల్లేష్, వీరేశ్, తుడుం శ్రీనివాస్, వెంకటేష్,నాగరాజు,మురళి గౌడ్,శివ,నవీన్, కిరణ్, కాంగ్రెస్ శ్రేణులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో నాలెడ్జ్ ఐకాన్ స్కూల్ విద్యార్థుల ఘన విజయం

కుత్బుల్లాపూర్ డిసెంబర్ 17(వాయిస్ టుడే): జాతీయ స్థాయిలో నిర్వహించిన "నేషనల్ ఓపెన్ టు ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్%-%2025" పోటీల్లో నాలెడ్జ్ ఐకాన్ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచి పాఠశాలకు గర్వకారణమయ్యారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు మొత్తం 3 బంగారు పతకాలు, 2 వెండి పతకాలు, 2 కాంస్య పతకాలు సాధించి అద్భుత విజయాన్ని నమోదు చేశారు.

ఈ పోటీలు ఆదివారం కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఘనంగా నిర్వహించబడగా, ప్రముఖ సినీ నటుడు డా. సుమన్ తల్వార్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమానికి నాలెడ్జ్ ఐకాన్ స్కూల్ కరస్పాండెంట్ ఎం.వై. రాజేష్ కుమార్ కూడా అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం మరియు నిరంతర సాధన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలకు దారి తీస్తాయని ఆయన ప్రశంసించారు. అదేవిధంగా, 130వ డివిజన్ కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి నాలెడ్జ్ ఐకాన్ స్కూల్‌ను సందర్శించి, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులను హృదయపూర్వకంగా అభినందించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, ఇలాంటి విజయాలు మరిన్ని సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పిల్లలకు శిక్షణ అందించిన మాస్టర్ బాలు ప్రసాద్, మాస్టర్ శైలజ ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ ప్రతిభను వెలికి తీస్తున్న నాలెడ్జ్ ఐకాన్ స్కూల్ యాజమాన్యానికి, శిక్షకులకు ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ విజయం భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలకు నాంది పలకాలని విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఉపాధి హామీ పథకం పేరుమార్పుపై మోదీ ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిరసన

కుత్బుల్లాపూర్ డిసెంబర్ 17(వాయిస్ టుడే): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ( ఎం జి ఎన్ ఆర్ ఈ జి ఎస్ ) పేరును పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజనగా మార్చాలని తీసుకున్న నిర్ణయాన్ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సూరారం కాలనీ బస్‌స్టాప్ పరిధిలోని మహాత్మా గాంధీ మరియు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాలకు పూలమాలలు వేసి నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ.. "గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో మహాత్మా గాంధీ పేరు మీద ప్రారంభించిన ఉపాధి హామీ పథకాన్ని పేరుమార్చడం బీజేపీ ప్రభుత్వ రాజకీయ సంకుచితత్వానికి నిదర్శనం. పేరు మార్చడమే కాకుండా కూలీలకు కనీస వేతనాలు పెంచడం, పని దినాలు 100 నుంచి 200కి పెంచడం, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించడం వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి" అని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ పేరును పథకం నుంచి తొలగించడం దేశ చరిత్రను మార్చే ప్రయత్నంగా కాంగ్రెస్ పార్టీ చూస్తుందని, ఇటువంటి నిర్ణయాలను ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు సోమ్మన్న శ్రీధర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాగేశ్వర్ రెడ్డి, నాగి రెడ్డి, సంజీవ రెడ్డి, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, హరి కిరణ్, ,కరణ్, గఫ్ఫార్ , రాంచందర్, రాజు హరి,నరేందర్, యూసఫ్, హేమ తులసి, శైలజ, రేఖ , ప్రసన్న, అర్చన, రమ్య, సంతోషి, డివిజన్ అధ్యక్షులు బేకు శ్రీనివాస్, గణేష్, బుయ్యని శివ, ఎండి లాయక్, సంతోష్ ముదిరాజ్, ఎండి జాకీర్, నరేందర్ రెడ్డి, నర్సింహా , చందు, బుచ్చి రెడ్డి, సురేందర్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలు ముగిసినందున జడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికలకు సంసిద్ధం కావాలి

## తెలంగాణ జనసేన రాష్ట్ర నాయకులు



కూకట్ పల్లిబీ, డిసెంబర్ 17(వాయిస్ టుడే): తెలంగాణలో జనసేన పార్టీని విస్తృతస్థాయిలో తీసుకువెళ్లాలని పార్టీ అధ్యక్షులు ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అదేశాల మేరకు బుధవారం పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లో తెలంగాణలోని ఉమ్మడి10 జిల్లాల పార్టీ శ్రేణులు మరియు గ్రేటర్ హైదరాబాద్ పార్టీ శ్రేణులతో ముఖ్య సమావేశం ఉంటుందని, కావున పార్టీలోని నియోజకవర్గం ఇన్చార్జిలు సభ్యులు, ఘవివిధ పదవులల్లో ఉన్న నాయకులు వీర మహిళలు, క్రియాశీలక వాలంటీర్లు అందరూ తమ నియోజకవర్గం నుండి పార్టీ శ్రేణులు అందరు పాల్గొనేలా అందరూ బాధ్యతా తీసుకుని ఈ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయగలరని కోరారు. ప్రధానంగా సమావేశం ముఖ్య తెలంగాణలో జరిగిన గ్రామపంచాయితీ ఎన్నికలలో సర్పంచులు, వార్డ్ మెంబర్లు గా జనసేన పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించి వారిని మరియు పోటీలో నిలబడి చివరివరకు గెలుకు ప్రయత్నించిన వారిని అభినందించారు. ఈ మేరకు జడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికలలో పోటీ చేయాలనుకునేవారు మీరు ఈ సమావేశంలో పాల్గొని మీ పేర్లను నమోదు చేసుకోగలరని సూచించారు.

150 డివిజన్లు ఉన్న గ్రేటర్ హైదరాబాదును ప్రభుత్వం 300 డివిజన్లు చేసిందని, డివిజన్ల హద్దుల పూర్తి వివరాలు ప్రభుత్వం తరపున అందాల్సి ఉందని కొద్ది నెలల్లో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు రానున్నాయి. డివిజన్ల వారిగా పార్టీని విస్తృతస్థాయిలో తీసుకెళ్లడానికి కార్యాచరణపై సమావేశం ఉంటుందని తెలిపారు. వేదిక: విన్ ప్యాలస్, చిత్తరమ్మ గుడి పక్కన, ఉషా ముళ్ళపూడి హాస్పిటల్ ఎదురుగా, గాజులరామారం, కుత్బుల్లాపూర్ మీ నియోజకవర్గంలోని అన్ని వాట్సప్ గ్రూపులలో అందరికీ తెలియజేయాలని తెలంగాణ జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు, ప్రకటనలో తెలిపారు.



## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### ఇన్స్పెక్టర్ ఆంజనేయులు

హైద్రాబాద్ (వాయిస్ టుడే):సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ఇనిస్పెక్టర్ ఆంజనేయులు అన్నారు. ఈ మేరకు బుధవారం కీసరలోని శ్రద్ధ జూనియర్ కాలేజ్, స్ఫూర్తి డిగ్రీ కాలేజీలో సైబర్ క్రైమ్ అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ అనవసరమైన ఆన్లైన్ లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. ఎలాంటి ఫ్రాడ్ కాల్స్ వచ్చిన వాటి లిఫ్ట్ చేయవద్దన్నారు. ఎలాంటి సైబర్ మోసాలకు గురైన వెంటనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎస్సై హరిప్రసాద్ , పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు, కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థాన పెన్షనర్ల డే

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట వారు దివి 17. 12. 2025 న పెన్షనర్స్ డే సందర్భంగా సంఘ కార్యాలయం నందు 85 సంవత్సరములు వయసు పూర్తి చేసుకున్న వారికి శ్రీ కుంతి పురం శేషాచార్యులు మరియు ఇటీవల పదవీ విరమణ పొందిన ప్రధానార్చకులు లక్ష్మీనరసింహాచార్యులు ఘనంగా సన్మానము చేయనైనది. ఈ సమావేశమునకు అధ్యక్షులు వీ నరసింహారావు. కార్యనిర్వాక అధ్యక్షులు కే. బాల్ నర్సయ్య. ఉపాధ్యక్షులు హనుమంతరావు రంగాచారి ఆంజనేయులు. గౌరవ సలహాదారులు శివకుమార్ చలమాచార్యులు నరేందర్ గోపాల్ ప్రధాన కార్యదర్శి కొక్కొండ యాదగిరి కార్యవర్గ సభ్యులు బలరాం సింగ్ గుంటి యాదగిరి మల్లారెడ్డి సత్తయ్య స్వామి అంజయ్య సత్యనారాయణ వెంకటలక్ష్మి పాల్గొనినారు.

## ప్రజా ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అమలుచేస్తున్న పథకాలకు ఆకర్షితులై 50 మంది కాంగ్రెస్ లో చేరిక

### టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్



కూకట్ పల్లి, డిసెంబర్ 17(వాయిస్ టుడే): టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ సమక్షంలో ఏఎంసీ డైరెక్టర్ జమీర్ ఆధ్వర్యంలో బుధవారం కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శ్రీ హేమదుర్గ భవన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, విధానాలకు ఆకర్షితులై 50 మంది ఇతర పార్టీల నుండి నాయకులు, కార్యకర్తలను బండి రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ నేపథ్యంలో వారికి స్వాగతం పలుకుతు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అభివృద్ధి చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ఈ చేరికలు కాంగ్రెస్ పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తాయని స్పష్టం చేశారు. అలాగే దేశంలో ఘనమైన చరిత్రగల కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టి ఎప్పుడు పేదలకు అండగా ఉండే పార్టి కాంగ్రెస్ పార్టి, సంక్షేమ పథకాలలో ఉచిత బస్సు, గృహ జ్యోతి, కొత్త రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ (పది లక్షల ఆరోగ్య భీమా), ప్రజా ప్రభుత్వం తరపున డ్వాక్రా మహిళా గ్రూపులకు పెట్రోల్ పంపులు, ఆర్టీసీ బస్సుల కాంట్రాక్టులు ప్రభుత్వం ఇస్తుంద న్నారు, రాబోయే రోజులలో అర్హులైన ప్రజలందరికి రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్లు,ఇతర సంక్షేమ పథకాలు వచ్చే విధంగా చూస్తానన్నారు, కూకట్ పల్లి నియోజకవర్గం లో పాత డివిజన్ల తో పాటు కొత్తగా ఏర్పాటైతున్న 15 డివిజన్లలో కాంగ్రెస్ పార్టి జండా ఎగురుతే నియోజకవర్గం లో ఇంటిగ్రాటెడ్ స్కూల్స్, విధ్యా, వైద్యం, స్థానిక సమస్యలు, తాగు నీరు, రోడ్లు, డ్రైనేజి, కమ్యూనిటీ హాల్స్ ఇతర అభివృద్ధి తన వంతు కృషి చేస్తానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్లా, యూత్ వైస్ ప్రెసిడెంట్ నజీర్, కూకట్ పల్లి యూత్ వైస్ ప్రెసిడెంట్ మోసిన్, మహిళ కాంగ్రెస్ సాయి తులసి, కూకట్ పల్లి మండల్ యూత్ ప్రెసిడెంట్ ఇర్ఫాన్, డిస్టిక్ జనరల్ సెక్రెటరీ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు



## పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ పరిశీలించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల జిల్లా డిసెంబర్ 17: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడో ఫేజ్ ఎన్నికలలో భాగంగా ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాల్లో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. ముస్తాబాద్ మండలకేంద్రం, నామాపూర్, గంభీరావుపేట మండలం లింగన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గంభీరావుపేట లోని కేజీ టూ పీజీ విద్యాలయం, ఎల్లారెడ్డిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రంలో ఆవరణలో పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారా అని ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన 50 మంది యువకులు

### కండువా కప్పి ఆహ్వానించిన జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్



కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, ప్రజాపాలనకు ఆకర్షితులై యువత స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన సుమారు 50 మంది యువకులు కాంగ్రెస్ పార్టీ లో చేరారు. జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, డిసిసి అధ్యక్షుడి తో పాటు మాజీ అధ్యక్షులు నాగుల సత్య నారాయణ, టౌన్ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ అధ్యక్షులు సూర దేవరాజు కండువా కప్పి యువకులను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజాపాలనకు ఆకర్షితులై యువత కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించిందని, అదే ఉత్సాహంతో రానున్న ఎన్నికల్లో భారీగా ప్రజాప్రతినిధులను గెలిపించుకునేలా పార్టీ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు పెద్దపీట వేస్తున్న తరుణంలో అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తు ముందుకెళుతున్నామని చెప్పారు. పార్టీ పటిష్టత కోసం నిబద్ధతతో పని చేయాలని ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ నూతనంగా పార్టీలో చేరిన యువకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ జిల్లా సభ్యులు సంగీతం శ్రీనాథ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డిమల్ల భాను, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు చుక్క రాజశేఖర్, యూత్ కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు పోగుల దేవరాజు, పట్టణ యూత్ మాజీ అధ్యక్షుడు చిందం శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ సెక్రటరీ ఆకేని సతీష్, నాయకులు కలిం, ఆడెపు ప్రసాద్, రాపల్లి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీలపై స్పష్టీకరణ

### గీతం యూనివర్సిటీ, హైదరాబాద్ క్యాంపస్

పటాన్ చెరు : గీతం యూనివర్సిటీ హైదరాబాద్‌లోని రుద్రారం క్యాంపస్‌కు సంబంధించిన విద్యుత్ వినియోగ చార్జీల విషయంలో కొన్ని మీడియా కథనాల్లో ధృవీకరణ లేని మరియు ధృవీకరంచు కోకుండా సమాచారం ప్రచురించబడింది. ఈ నేపథ్యంలో వాస్తవాలను స్పష్టంగా నమోదు చేయడం అవసరం. గీతం యూనివర్సిటీ హైదరాబాద్ క్యాంపస్ కార్యకలాపాలు జూలై 2009 లో ప్రారంభమయ్యాయి. కాబట్టి 2008 నుంచి విద్యుత్ చార్జీలు చెల్లించలేదని చెప్పడం పూర్తిగా అసత్యం. హైదరాబాద్ క్యాంపస్‌కు సంబంధించి విద్యుత్ శాఖ ద్వారా గీతం యూనివర్సిటీకి వాస్తవంగా బిల్లులు జారీ చేసిన ప్రతి విద్యుత్ బిల్లును యూనివర్సిటీ క్రమం తప్పకుండా చెల్లిస్తోంది. యూనివర్సిటీ చెల్లించవలసిన విధంగా జారీ చేసిన బిల్లుల విషయంలో ఎలాంటి బకాయిలు లేవు. వివాదాస్పదమైన కొన్ని క్లేములను గౌరవనీయ తెలంగాణహైకోర్టులో సవాలు చేశాము. ఈ విషయం న్యాయస్థాన పరిధిలో (Sub judice)లో ఉంది. విద్యాసంస్థ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా అనవసరమైన ఇబ్బంది సృష్టించే వార్తలను ప్రచురించే ముందు మీడియా సంస్థలు వాస్తవాలను నిర్ధారించుకోవాలని మనవి చేస్తున్నాము.



## ఒలివ్‌మౌంట్ స్కూల్ నాలుగో తరగతి విద్యార్థి గెలాక్సీ స్ట్రైకర్స్ స్పేస్ క్లబ్‌లో అందరినీ ఆశ్చర్యపరిచే ఒక ఆలోచనను పంచుకున్న హర్షల్ శర్మ

హైదరాబాద్ : డిసెంబర్ 17: హర్షల్ శర్మ అత్తపూర్‌లోని ఒలివ్‌మౌంట్ స్కూల్ నాలుగో తరగతి విద్యార్థి గెలాక్సీ స్ట్రైకర్స్ స్పేస్ క్లబ్‌లో అందరినీ ఆశ్చర్యపరిచే ఒక ఆలోచనను పంచుకున్నాడు. అంత అభివృద్ధి చెందిన నాగరికతలకు మనం చీమలలా కనిపించవచ్చు, చాలా చిన్నవాళ్లమై గమనించబడకుండా పోవచ్చు ఈ ఆలోచనను అతని గురువు శ్రీకాంత్ పంజాల, స్పేస్ మెంటర్ ( ఐ ఎస్ ఆర్ ఓ) సర్టిఫైడ్ ట్రైనర్ ప్రసంశించి అభినందించారు.



## పేద ప్రజలకు దుప్పట్లు పంపిణీ చేసిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీరాములు ముదిరాజ్

హైదరాబాద్: డిసెంబర్ 17 ( వాయిస్ టూ డే): అంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని అంబర్పేట్ లోని పేద ప్రజలకు చలికాలం దృష్టిలో ఉంచుకొని దుప్పట్ల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీరాములు ముదిరాజ్ చలికి ఇబ్బంది పడుతున్న వృద్ధులను దృష్టిలో ఉంచుకొని వారికి బ్లాంకెట్లు దుప్పట్లను అందజేశారు. వృద్ధులు అందరూ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతోని ఉండాలని ఆశీర్వదించారు.




## కొండపైన 24/7 అంబులెన్స్ సౌకర్యం

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: భక్తుల సౌకర్యార్థం మేడికోవర్ హాస్పిటల్ వారి సౌజన్యంతోకొండపైన అంబులెన్స్ ఈరోజునుండి ఏర్పాటు చేయడమైనది ఇట్టి అంబులెన్స్ వాహన పూజ యందు అను వంశిక ధర్మకర్త. దేవస్థాన అధికారులు. ప్రధాన అర్చకులు మరియు మెడికవర్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకార్యనిర్వహణాధికారినిర్ణయం మేరకు భక్తుల భద్రత నిమిత్తం దేవస్థానంలో పెట్రోలింగ్ వాహనాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పెట్రోలింగ్ వాహనం ఎస్పీఎఫ్ సిబ్బందిచే 24 గంటలూ భక్తుల భద్రతార్థం కొండపై, కొండకింద, గోశాల, పాత గుట్ట తదితర ప్రాంతాలలో గస్తీ తిరుగుతూ భక్తులకు తగిన రక్షణ కల్పించుటకు ఈరోజు నుండి వినియోగంలోకి తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా వాహనానికి పూజలు నిర్వహించబడినవి. ఈ వాహన పూజా కార్యక్రమంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్త, దేవస్థాన అధికారులు, ప్రధానార్చకులు మరియు ఎస్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఒక్కరి కోసం అందరం

### - భువనగిరి గురుకుల పూర్వ విద్యార్థులు

హుజూర్నగర్, డిసెంబర్ 17 (వాయిస్ టుడే) : మేళ్లచెరువు మండలం, కందిబండ గ్రామానికి చెందిన పోలే నరేందర్ ఇటీవల కాలంలో అనారోగ్య కారణంతో మరణించడం జరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ప్రథమ స్థానంలో ఉన్న భువనగిరి గురుకుల పాఠశాల & కళాశాల 1983 సంవత్సరం నుంచి విద్యాబుద్ధులు నేర్చుకొని వివిధ హోదాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒక్కరి కోసం మనమందరం అనే ఆలోచన విధానంతో & పే బ్యాక్ టు ద సొసైటీ అనే ఆలోచన విధానంతో ప్రతి ఒక్కరు వారి సంపాదన నుంచి తన కుటుంబానికి తన బిడ్డల పై చదువుల కొరకు ఆసరాగా ఉండాలనే సదుద్దేశంతో ఒక 10,3816 /- రూపాయలను పోలే దివ్య పేరు మీదుగా 50,000/- పోలే నవ్య పేరు మీదగా 50,000/- రూపాయలను తొమ్మిది సంవత్సరాల ఏడు నెలల కాల పరిమితికి బుధవారం ఇండియన్ పోస్టల్ ఆఫీస్ హుజూర్నగర్ నందు ఫిక్స్ డిపాజిట్ చేయడం జరిగింది. భవిష్యత్తులో భువనగిరి గురుకుల పూర్వ విద్యార్థులు మరియు ప్రస్తుత చదువుతున్న విద్యార్థులు వారి యొక్క పై చదువుల నిమిత్తం ఆర్థిక సహాయ సహకారాలు & విద్యా వైద్య ఉపాధి మార్గాలను చూపించేందుకు పూర్వ విద్యార్థులందరూ కూడా సంఘటితంగా సమాజ అభ్యున్నత కోసం పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం కదంతొక్కడానికి సిద్ధంగా ఉంటారు అని మంద రవి తెలియజేసారు. ఇట్టి కార్యక్రమంలో మంద రవి, SSC-1997-98, బండి మధుసూదన్ SSC-1995-96, నందిగామ పాపయ్య SSC-1996-97, సురపల్లి రామారావు, SSC-1999-2000 నందిగామ నాగేశ్వరరావు, 1999–2000, పోలే ధనలక్ష్మి ,పోలే సుశీలలు పాల్గొన్నారు.

## పెద్దపులి అడుగుజాడలు గుర్తింపు.. అటవీ శాఖ అప్రమత్తం

రామకృష్ణాపూర్, డిసెంబర్ 17 (వాయిస్ టుడే) : ఆర్కే.పీ సిహెచ్పి వర్క్షాప్, ఆర్కే–5 శివాలయం ప్రాంతంలో పెద్దపులి తిరుగుతుందన్న సమాచారంతో అటవీశాఖ అధికారులు మంగళవారం రాత్రి ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అయితే ఆ సమయంలో పులి అడుగుజాడలు కనిపించలేదని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై అప్రమత్తమైన అధికారులు బుధవారం ఉదయం ఓసి డంప్ ఏరియా, ఆర్కే–5 శివాలయం ప్రాంతాల్లో మరోసారి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా "వాయిస్ టుడే" ప్రతినిధి చరవాణి లో అధికారులను వివరణ కోరగా, ఓసి డంప్ ఏరియా, ఆర్కే–5 శివాలయం ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు సూచించే అడుగుజాడలు గుర్తించినట్లు మంచిర్యాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్ రావు, మందమర్రి ఏరియా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సంతోష్ తెలిపారు. సమీప ప్రాంత ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రైతులు తమ పొలాల చుట్టూ ఎలాంటి కరెంటు తీగలు అమర్చవద్దని అధికారులు హెచ్చరించారు. కరెంటు తీగల వల్ల పెద్ద పులికి హాని కలిగితే వన్యప్రాణి సంరక్షణ చట్టం–1972 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. అలాగే పెద్దపులి కారణంగా ఎలాంటి హాని జరిగినా అటవీ శాఖ ద్వారా పరిహారం అందజేస్తామని అధికారులు తెలిపారు.



## ఐ ఎల్ పి ఏ రాష్ట్ర న్యాయవాదుల సదస్సుకు జిల్లా కోర్టు జడ్జిలను ఆహ్వానించిన కన్వీనర్ గోపి కృష్ణ

భద్రాద్రి కొత్తగూడెం (వాయిస్ టుడే) డిసెంబర్ 17: ఈనెల 20వ తేదీన రాష్ట్ర జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగూడెం క్లబ్బులో జరగబోయే ఇండియన్ లాయర్స్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర న్యాయవాదుల సదస్సుకు జిల్లా కన్వీనర్ గోపికృష్ణ బుధ వారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్, అదనపు జిల్లా జడ్జి ఎస్.సరిత, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కే.కిరణ్ కుమార్, అదనపు సీనియర్ జడ్జి కర్ణాటి కవిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.సుచరిత, రెండవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి.రవికుమార్ మూడవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వనం వినయ్ కుమార్, స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మెండు రాజమల్లు లను శనివారం జరగబోయే సమావేశానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సుంకర భానుప్రియ , పట్టుపల్లి నిరంజన్ రావు,అంబటి రమేష్, ఎండి సాధిక్ పాషా ,ఎర్రపాటి కృష్ణ , వి .హరి, ఎర్ర కామేష్, విజయ్ తదితరులు ఆహ్వానించిన వారిలో ఉన్నారు.




## సింగరేణి దినోత్సవం సందర్భంగా వెల్ బేబీ షో

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే డిసెంబర్ 17 : సింగరేణి కాలరీస్ కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో బుధవారం తేదీన సింగరేణి దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఉద్యోగుల కుటుంబ మహిళల కొరకు నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా సింగరేణి ఉద్యోగుల 5 సంవత్సరాల లోపు పిల్లలకు బుధవారం ఉదయం 10.00 గంటలకు కొత్తగూడెం సింగరేణి ప్రధాన ఆసుపత్రి నందు వెల్ బేబీ షో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సిఎంఓ ఆర్ కిరణ్ రాజ్ కుమార్తో పాటు ఏసిఎంఓలు ఎం.ఉష, జి సునీల ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్యుడు అజయ్ కుమార్ భోసలే హెల్త్ ఆఫీసర్ లలిత న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. 16 మంది ఉద్యోగుల చిన్నారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సిఎంఓ ఆర్ కిరణ్ రాజ్ కుమార్ తో పాటు ఏసిఎంఓలు ఎం.ఉష, జి సునీల ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రంగశాయిపేటలో వైభవంగా పడిపూజ మహోత్సవం

**- మహా అన్న ప్రసాద వితరణ**

**- హాజరైన నగర మేయర్ గుండు సుధారాణి,ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య**



వరంగల్ (వాయిస్ టుడే ) డిసెంబర్ 17 : స్వామియే శరణం అయ్యప్ప... స్వామి శరణం.. అయ్యప్ప శరణం... అంటూ అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో రంగశాయిపేట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రాంగణం ప్రతిధ్వనించింది. నగరంలోని రంగశాయిపేట అయ్యప్ప సేవా పరపతి సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన హరిహర సూతుడు అయ్యప్ప స్వామి 17వ మహా పడిపూజ మహోత్సవం అంగరంగ వైభవంగా కనుల పండుగగా జరిగింది. అయ్యప్ప మాలధారులు భారీగా హాజరై అయ్యప్ప భజనలు, కీర్తనలు ఆలపించారు. కొల్లూరి యోగానంద్ గురు స్వామి ఆలపించిన అయ్యప్ప మధుర గీతాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. వేద బ్రాహ్మణోత్తములైన బ్రహ్మశ్రీ వెలిదే ప్రదీప్ శాస్త్రి మంత్రోచ్చారణలతో నిర్వహించిన పడిపూజలో వందలాదిమంది మాలధారులు, భక్తులు పాల్గొని అయ్యప్ప అభిషేకాన్ని కనులారా వీక్షించి స్వామి వారి కరుణాకటాక్ష వీక్షణాలకు పాత్రులైనారు. ఈ పడి పూజలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, నగర మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు గుండు చందన పూర్ణచందర్, మరుపల్ల రవి పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ అయ్యప్ప మాల ధారణతో మన సంస్కృతి సాంప్రదాయాలు, సనాతన ధర్మంతో పాటు ప్రజల్లో ఆధ్యాత్మిక భావం వెల్లివిరుస్తుందని అన్నారు. అయ్యప్ప స్వాములు మండల దీక్ష తీసుకుని ఎంతో నియమనిష్ఠలు, క్రమశిక్షణతో దీక్ష పూర్తి చేసుకొని శబరిమలై యాత్ర చేసి అయ్యప్ప స్వామి కరుణ కటాక్ష వీక్షణాలతో పునీతులవుతున్నారని, అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ క్షేమంగా సుఖసంతోషాలతో ఉండాలని తెలిపారు. మానసా దేవి ప్రత్యంగిరా దేవి ఉపాసకులు కృపాకర్ గురుస్వామి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి 18 మెట్ల యొక్క విశిష్టత, గురువును ఎందుకు పూజించాలి? ఎలా పూజించాలో గురువు యొక్క గొప్పతనాన్ని వివరించారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి కొల్లూరు యోగానంద్ ను అయ్యప్ప మాలదారులు గజమాలతో అయన ను ఘనంగా సత్కరించారు.



ఈ పడిపూజ కార్యక్రమం లో వెలిదే నరసింహమూర్తి, వెలిదే భార్గవ శర్మ, గురుస్వామి కత్తి ఎల్లా గౌడ్, బజ్జూరి వీరేశం, నందా రమేష్, అనుమాండ్ల రమేష్, కొండ్రెడ్డి నవీన్ రెడ్డి, దేవులపల్లి మధు, కుంట శ్రీధర్, బూర రవి గౌడ్, పాల రంజిత్, సోమ మనోహర్, పార్వతి శంకర్, బజ్జూరి ప్రభాకర్, దామెరకొండ కర్ణాకర్, బొమ్మగాని సతీష్, పోకల ఈశ్వర్, మిట్టపల్లి కపిల్, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.



## సంగంబండ సర్పంచ్గా గవినోళ్ల సుమిత్రమ్మ...

మక్తల్ డిసెంబర్ 17 వాయిస్ టుడే ప్రతినిధి: తల మండలంలోని సంఘమండ గ్రామ సర్పంచ్ గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గవినోళ్ల సుమిత్రమ్మ ఘన విజయం సాధించారు. ఏకంగా సమీప ప్రత్యర్థి పై 661 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా మొత్తం పోలైన ఓట్లలో... కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గవినోళ్ల సుమిత్రమ్మ కు. 1042 ఓట్లు, సమీప ప్రత్యర్థి లక్ష్మీ కి 381ఓట్లు, మరో అభ్యర్థి కళావతికి 97 ఓట్లు పడ్డాయి. మరోవైపు ఏకంగా పదికి పది వార్డులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించారు.సంగంబండ గ్రామ చరిత్రలోనే కనివిని ఎరుగని రీతిలో భారీ మెజార్టీ సాధించడంతో... కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ.. సంగమండ గ్రామానికి కాపలా కుక్కలా పని చేస్తానని, సర్పంచ్ ఎలక్షన్లలో కలిసికట్టుగా పని చేసిన విధంగా రాబోయే ఎన్నికల్లో అందరం కలిసి పనిచేసే గెలిపించుకుంటామని అన్నారు. మార్కెట్ చైర్మన్ రాధా లక్ష్మారెడ్డి, బాల్ రెడ్డి, వాడు సభ్యులు. ఉప 2.సర్పంచ్ సురేష్, 1.గోవిందమ్మ, 3.నరేందర్ రెడ్డి, 4.లక్ష్మి, 5.తిమ్మప్ప, 6.బాల్రాజ్, 7. గుర్లపల్లి.సువర్ణ, 8.ఎ. వి.కృష్ణారెడ్డి 9. కె.నాగప్ప, 10.శ్రీలత, నాయకులు సత్యారెడ్డి, సుధాకర్ రెడ్డి, బలరాం రెడ్డి, కేశవరెడ్డి, బాల్ చందర్ రెడ్డి, వెంకటేష్ రెడ్డి బలరాం రెడ్డి, సత్యారెడ్డి, బాలచందర్, మాజీ సర్పంచ్ కేశవరెడ్డి, సుధాకర్ రెడ్డి, బాల్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, వెంకటేష్ రెడ్డి, జి.జైపాల్ రెడ్డి. నాగిరెడ్డి, సుధాకర్ రెడ్డి, లింగారెడ్డి, బాలచందర్ రెడ్డి, బి రాజశేఖర్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఎల్ల లింగారెడ్డి, జి .భాస్కర్ రెడ్డి, పి సుదర్శన్ రెడ్డి, జి.అవంతి వెంకటేష్, పీ. బాల్ రెడ్డి, సంతోష్ రెడ్డి, అజయ్ రెడ్డి ,కుమార్, గ్రామస్తులు , మహిళలు, పవిత్ర, ఉమా, అరుణమ్మ, రాధా, నీలమ్మ, అనసూయ, సువర్ణ, శకుంతల,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## జాతీయ సాఫ్ట్ టెన్నిస్ క్రీడాకారులను ఘనంగా సన్మానించిన శాప్ చైర్మన్ రవి నాయుడు

విజయవాడ : ఇటీవలే మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని దివాస్ పట్టణంలో డిసెంబర్ 11 నుంచి 14 వరకు నిర్వహించిన 69వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్షిప్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాకారులు అద్భుత ప్రతిభను ప్రదర్శించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. ఈ పోటీల్లో అండర్–14 బాలికల వ్యక్తిగత సింగిల్స్ విభాగంలో ఏ.ఎస్. వైశాలి రజత పతకాన్ని కైవసం చేసుకోగా, అండర్–17 బాలుర వ్యక్తిగత సింగిల్స్ విభాగంలో బి.ఎం.ఎన్.వి. కార్తీక్ కాంస్య పతకాన్ని సాధించారు. వైశాలి, కార్తీక్ ఇద్దరూ కృష్ణాజిల్లా నుండి ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి ఈ విజయాలు సాధించడం విశేషం. ఈ సందర్భంగా శుక్రవారం విజయవాడలోని శాప్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శాప్ చైర్మన్ రవి నాయుడు క్రీడాకారులను అభినందించి ఘనంగా సత్కరించారు. వారి కృషి, పట్టుదల, నిబద్ధత వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఆయన ప్రశంసించారు. అలాగే రానున్న జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో మరింత మెరుగైన ప్రదర్శన చేసి పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. యువ క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించేందుకు శాప్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ దారం నవీన్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి లావేటి దుర్గారావు, క్రీడా సంఘ ప్రతినిధులు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన వైద్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్




భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే డిసెంబర్ 17: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ జిల్లాలోని మంగపేట దమ్మపేట ,పట్వారి గూడెం ,వినాయకపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగినది .రికార్డులను పరిశీలించడం జరిగినది ఎల్సిడిసి కుష్టు వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగ రేపటి నుండిజరుగుతున్న సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తెలియజేశారు. ఆరోగ్య కేంద్రాలలో ఉన్న రక్త పరీక్ష కేంద్రాలను మందుల నిల్వ నిర్వహణ గురించి పరిశీలించడం జరిగినది . ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు డి పీ ఎం ఓ మోహన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## మృతి చెందిన బాలుని కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన కాంగ్రెస్ నాయకులు

వరంగల్ ( వాయిస్ టుడే ) డిసెంబర్ 17 : అండర్ రైల్వే గేట్ శివనగర్ పాడి మల్లారెడ్డి నగర్ కి చెందిన మిరియాల కృష్ణ రజిత దంపతుల 12 సంవత్సరాల కుమారుడు మిరియాల గౌతమ్ ఖిలా వరంగల్ చిల్డ్రన్స్ పార్క్ ను చూడడానికి వెళ్లి అక్కడ ఉన్న గుర్రం వద్దకు వెళ్లగ గుర్రం తన కాలుతో బలంగా తన్నగా ప్రమాదవశాత్తు గౌతమ్ మరణించడం జరిగింది. ఈ విషయం స్థానిక కాంగ్రెస్ నాయకులు శ్రీరాం రాజేష్, పగడాల సతీష్ ల దృష్టికి స్థానికులు తీసుకుని వెళ్ళగా బుధవారం అ కుటుంబాన్ని పరామర్శించి పేదవారైనా అ కుటుంబానికి ఆర్థిక సాయం చేయడం జరిగింది. అలాగే ఈ విషయాన్నీ కొండా దంపతుల దృష్టికి తీసుకుని వెళ్లి వారి చేత కూడా తగిన సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా మాట ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అక్షిత్ పటేల్, మాన్యం సతీష్,సంఘని ప్రియదర్శిని,గడ్డం లత మరియు స్థానికలు పాల్గొన్నారు.